Eenaadu, 17.04.2022

# నిజ జీవిత ప్రతిబింబం నాటకం

## • సినీ నటుడు ఎల్బీ శ్రీరాం



మాట్లాడుతున్న ఎల్బీ శ్రీరాం

తెనాలి టౌన్, ఏప్రియల్ 16 : నిజ జీవిత ప్రతిబింబం నాటకం అని సినీ, నాటక రచయిత, నటులు ఎల్.బి.శ్రీరాం మాట్లాడుతూ అన్నారు. కేంద్ర సాహిత్య అకాడెమి, కళల కాణాచి ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో తెలుగు నాటకం - సాహిత్యం అనే అంశంపై ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎల్బీ శ్రీరాం మాట్లాడుతూ నాటకం ఎంత గొప్పదైనా బతుకుతెరువు కోసం సినిమాకు రాక తప్పలేదన్నారు. నాటకం ఎప్పటికప్పుడు నూతనత్వాన్ని సంతరించుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తుందన్నారు. నాటకం ప్రదర్శన విధానం మారవచ్చేమోకానీ అది బతికే ఉంటుం దన్నారు. సినిమా మనిషిపై ఎక్కువ ప్రభావం చూపితే నాటకం జీవితాన్ని చూపిస్తుందన్నారు. అజో విభో ఫౌండేషన్ వ్యవస్థాపకులు అప్పా జోస్యుల సత్యనారాయణ మాట్లాడుతూ సాహిత్యం మహా సముద్రమన్నారు. సాహిత్య ప్రక్రియలు ఎన్ని ఉన్నా నాటకం ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. ఆయన తన ప్రసంగంలో సైన్స్, టెక్నాలజీని మేళవించి ఉపన్యాసం చేశారు.శిక్షణ లేకుండా సాహిత్యం బోధ పడదన్నారు. సాహిత్యంలో నాటకం ఒక భాగమే అయినా సామాన్యుని దృష్టిని ఆకర్షించే గుణం ఎక్కువగా దానికే ఉందన్నారు.సాహిత్యం, సైన్స్ రెండూ లోక కల్యాణం కోసమేనన్నారు. ఈ సభకు సాహిత్య అకాడమి తెలుగు సలహా మండలి సంచాలకులు కె.శివారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వాసిరెడ్డి నవీన్, కె.పి. అశోక్ కుమార్, కందిమళ్ల సాంబశివరావు, బి.హెచ్.పద్మప్రియ వి.ఆర్.రాసాని, వాడ్రేవు సుందరరావు, వల్లూరు శివ ప్రసాద్, దీర్ఘాసి విజయభాస్కర్, రాజీవ్ వెలిచేటి తదితరులు ఉపన్యసించారు. ముగింపు సమావేశంలో చెరుకుమల్లి సింగారావు, గంగోత్రి సాయి పాల్గొన్నారు. అకాడమి ప్రాంతీయ కార్యదర్శి ఎస్.పి. మహా లింగేశ్వర్ స్వాగతం పలికారు.